సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025

జై శ్రీరామ్



- రామనామంతో పులకించిన నగరం
- వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులుగా ఇద్దరికి చోటు



ఎంపీ గొల్ల బాబూరావు



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)ని పునర్వ్యవస్థీకరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపీ గొల్ల బాబూరావుతో పాటు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడులకు సభ్యులుగా స్థానం లభించింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ప్రకటించింది. అలాగే పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు పీఏసీ శాశ్వత ఆహ్వానితులుగా ఉండనున్నారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పీఏసీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ తెలిపారు. విశాఖ జిల్లాకు 406 యూనిట్లు ప్రభుత్వం కేటాయించినట్లు పేర్కొన్నారు. రూ.16.88 కోట్లతో 32 రకాల రుణాలు లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు గల వారు మే 10 తేదీలోగా httpr://apo bmmr.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు.

15 నుంచి చేపల వేట నిషేధం



మహారాణిపేట: తూర్పు తీరంలో రెండు నెలల పాటు చేపల వేట నిలిచిపోనుంది. ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు(61 రోజులు) మత్స్య సంపద వేటకు ప్రభుత్వం నిషేధం విధించింది. తిరిగి జూన్ 15 నుంచి వేట ప్రారంభమవుతుంది. జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఇక్కడ 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. 749 మర పడవలు, 1,310 మోటారు పడవలు, 488 సంప్రదాయ తెప్పలు ఉన్నాయి. సుమారు 1.15 లక్షల మత్స్యకార కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. వీరిలో దాదాపు 25 వేల మంది సముద్రంలో చేపలు వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. విశాఖ హార్బర్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. కాగా.. మత్స్య సంపద పరిరక్షణ, పునరుత్పత్తి కోసం చేపలవేట నిషేధం అమలు చేస్తున్నట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ నిషేధం మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మత్స్యకారులు గమనించి ప్రభుత్వానికి సహకరించాలని జేడీ కోరారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రొయ్యలు, చేపలు సంతానోత్పత్తి చేసే కాలమని, ఈ రెండు నెలల పాటు వేటను నిలిపివేస్తే, తర్వాతి మత్స్యకారులకు సమృద్ధిగా చేపలు లభిస్తాయని జేడీ వివరించారు.

సర్కారు కళాశాలలు చతికిలబడి



ఇంటర్ ఫలితాల్లో జిల్లా ఆఖరి స్థానం ▪ ఫస్టియర్‌లో 34, సెకండియర్‌లో 55 శాతం ఉత్తీర్ణత

హైస్కూల్ ప్లస్‌లో దారుణమైన ఫలితాలు ▪ ప్రభుత్వ జూనియర్ కాలేజీల నిర్వీర్యమే లక్ష్యమా..?

విశాఖ విద్య: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు డీలాపడ్డాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోనూ రాష్ట్రంలోనే అట్టడుగు స్థానంలో విశాఖ జిల్లా నిలిచింది. ఫస్టియర్‌లో కేవలం 34 శాతం, సెకండియర్‌లో 55 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లా ఆఖరి స్థానంలో నిలవడం చూస్తుంటే.. ఫలితాలు రాబట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అర్థమవుతుంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అధ్యాపకుల ఖాళీల భర్తీపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. రేషనలైజేషన్ పేరుతో ఉన్న పోస్టులను కుదించేసింది. కాలేజీల్లో చదువులు ఎలా సాగుతున్నాయనేది క్షేత్ర స్థాయిలో సమీక్షలు కూడా లేవు. ప్రభుత్వ కాలేజీలను నిర్వీర్యం చేసి, తద్వారా ప్రైవేటు విద్యా సంస్థలకు మేలు చేకూర్చాలన్న కూటమి ప్రభుత్వ విధానాలకు ప్రతిరూపమే ప్రస్తుత ఇంటర్మీడియెట్ ఫలితాలు అని విద్యారంగ నిపుణులు అంటున్నారు. బోధన సిబ్బంది కొరత వల్ల తరగతులు సక్రమంగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు పాస్ కాలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఘోరమైన ఫలితాలు

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిల్లాలోని అన్ని యాజమాన్యాలు కలుపుకొని 79 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో నాల్గో స్థానంలో నిలిచింది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్‌లో 34 శాతం ఉత్తీర్ణత మాత్రమే రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీలో అతి తక్కువగా 16 శాతం మంది విద్యార్థులే పాసవ్వడం గమనార్హం. మల్కాపురం, పెందుర్తి, మధురవాడ, ఇస్లాంపేట, భీమునిపట్నం కాలేజీల్లోనూ 34 శాతం కంటే తక్కువగా ఫలితాలు వచ్చాయి. సెకండియర్‌లో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉత్తీర్ణత సగటు 87 శాతంతో రాష్ట్ర సూచికలో ఆరో స్థానంలో నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 55 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పెందుర్తి, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ, మల్కాపురం, ఇస్లాంపేట, ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 50 శాతంలోపు ఉత్తీర్ణత సాధించగా, ఆనందపురం కాలేజీలో అయితే అతి తక్కువగా 25 శాతం మంది విద్యార్థులే ఉత్తీర్ణత కావడం గమనార్హం. మొత్తంగా ప్రథమ, ద్వితీయ ఇంటర్‌లో జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది.

ఆ కాలేజీల్లో ప్రైవేటు వ్యాపారాలు

జిల్లాలోని భీమునిపట్నం, ఆనందపురం, మధురవాడ వంటి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని కొంతమంది అధ్యాపకులు చదువులను పూర్తిగా గాలికొదిలేశారనే విమర్శలు మొదటనుంచీ ఉన్నాయి. ఇక్కడి అధ్యాపకులు రెగ్యులర్ విద్యార్థులకు చదువులు చెప్పటం మానేసి, ఓపెన్ స్కూళ్లలో టెన్త్, ఇంటర్ అడ్మిషన్లపైనే ఎక్కువగా ఫోకస్ పెడుతూ.. ప్రైవేటు సంపాదన వైపు మొగ్గు చూపుతున్న కారణంగానే.. ఇక్కడ సరైన ఫలితాలు రావటం లేదనే ప్రచారం ఉంది.

హైస్కూల్ ప్లస్‌లోనూ అంతంతమాత్రమే..

బాలికలకు ఉన్నత విద్యను చేరువలోకి తీసుకురావాలనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌ల్లోనూ ఫలితాలు ఆశాజనకంగా లేవు. జిల్లాలోని 6 హైస్కూల్ ప్లస్ ల్లో ఫస్టియర్‌లో 18.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గోపాలపట్నంలో 43 మందికి ముగ్గురు, గంగవరంలో 31 మందికి నలుగురు, ములగాడలో 21మందికి ముగ్గురు మాత్రమే పాసయ్యారు. సెకండియర్‌లో 34.43 శాతం మంది ఉత్తీర్ణత నమోదైంది. రాంపురంలో అతి తక్కువగా ఉత్తీర్ణత శాతం నమోదు కావడం గమనార్హం. హైస్కూల్ ప్లస్‌లను మూసివేయాలనే ఉద్దేశంతోనే వీటి గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని.. అందుకనే ఇలాంటి ఫలితాలు వచ్చాయని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

ఫస్టియర్‌లో ఇలా..

కాలేజీ	పరీక్ష రాసినవారు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
ఆనందపురం	12	6	50
అగనంపూడి	129	56	43.41
భీమునిపట్నం	139	47	33.8
ఇస్లాంపేట	40	9	22.5
మధురవాడ	116	33	28.45
మల్కాపురం	23	4	17.39
డా. వీఎస్ కృష్ణా కాలేజీ	481	79	16.42
పెందుర్తి	144	46	31.94
విశాఖ బాలికల కాలేజీ	455	246	54.07

సెకండియర్‌లో ఇలా

కాలేజీ	పరీక్ష రాసినవారు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
ఆనందపురం	82	25	30.48
అగనంపూడి	87	59	67.81
భీమునిపట్నం	109	65	59.63
ఇస్లాంపేట	37	13	35.13
మధురవాడ	64	32	50
మల్కాపురం	27	10	37.04
డా. వీఎస్ కృష్ణా కాలేజీ	377	155	41.11
పెందుర్తి	163	73	44.79
విశాఖ బాలికల కాలేజీ	388	278	71.65

ఇంటర్‌లో బాలికలదే హవా

	ఫస్టియర్	సెకండియర్
బాలురు	77 శాతం	86 శాతం
బాలికలు	82 శాతం	89 శాతం

జిల్లాలో ఫస్టియర్‌లో 79 శాతం, సెకండియర్‌లో 87 శాతం ఉత్తీర్ణత



త్రిలోచన 981, ఎంపీసీ



ఎర్రిపిల్లి అనిత 976, బైపీసీ



వి.ధనసంజన 980, ఎంపీసీ



దొడ్డి అమృత లక్ష్మీగారి 985, ఎంపీసీ



శ్రీజ 992, ఎంపీసీ



ఎం.సృజన, 462, ఎంపీసీ



మేఘనా శర్మ 991, ఎంపీసీ



మనస్విని, 991, ఎంపీసీ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా బాలికలు సత్తా చాటారు. అత్యుత్తమ మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 188 జూనియర్ కాలేజీల నుంచి ఫస్టియర్ (జనరల్) 40,098 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 31,866 మంది పాసయ్యారు. తద్వారా 79 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. సెకండియర్‌కు 36,479 మంది హాజరవ్వగా 31,761 మంది పాసయ్యారు. 87 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఫస్టియర్‌లో బాలురు 77 శాతం పాసవ్వగా బాలికలు 82 శాతం పాసయ్యారు. సెకండియర్‌లో బాలురు 86 శాతం పాసవ్వగా బాలికలు 89 శాతం ఉత్తీర్ణత పొందారు. ఒకేషనల్ ఫస్టియర్‌లో బాలురు 48 శాతం పాసవ్వగా బాలికలు 77 శాతం పాసయ్యారు. సెకండియర్‌లో బాలురు 75 శాతం పాసవ్వగా బాలికలు 85 శాతం ఉత్తీర్ణత పొందారు. మొత్తంగా గతేడాది కంటే జిల్లాలో ఉత్తీర్ణత శాతం కొద్దిగా పెరిగింది. ఫస్టియర్‌లో రాష్ట్ర సూచికలో 4వ స్థానం, సెకండియర్‌లో 6వ స్థానం దక్కింది.

రీ వాల్యూయేషన్‌కు అవకాశం

ఫలితాలపై విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే రీ వాల్యూయేషన్‌కు అవకాశం కల్పించారు. రీ వాల్యూయేషన్ కోరే విద్యార్థులు రూ.260 ఫీజు చెల్లించి ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా రీ వెరిఫికేషన్ కోసం రూ.1,300లు ఫీజు చెల్లించాలి.

మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి 20 వరకు జరగనున్నాయి. విద్యార్థులు నిర్ణీత ఫీజుతో ఈ నెల 15 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలి.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఏపీసీ

జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. భీమిలి కేజీబీవీకి చెందిన ఎస్.ప్రణితి బైపీసీ ఫస్టియర్‌లో 440 మార్కులకు గాను 434 మార్కులతో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ జోగ చంద్రశేఖర్ రావు తెలిపారు. కేజీబీవీ ఆనందపురానికి చెందిన నమ్మి వసంత ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో 975 మార్కులు సాధించింది. కేజీబీవీ ఆనందపురంలో ఫస్టియర్ 67 శాతం, సెకండియర్ 85 శాతం, భీమునిపట్నంలో ఫస్టియర్ 78 శాతం, సెకండియర్ 97 శాతం, పద్మనాభం కేజీబీవీలో ఫస్టియర్ 41 శాతం, సెకండియర్ 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

డాక్టర్.. నా లక్ష్యం



ఇంటర్ బైపీసీలో 988 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. ఫస్టియర్‌లో 434 మార్కులు సాధించాను. ఎంబీబీఎస్ చదివి, తర్వాత పీజీ చేయడమే నా లక్ష్యం. మా నాన్న కాళ్ల అప్పలరాజు రేషన్ డీలర్. అమ్మ పద్మ గృహిణి. నేను చదువులో రాణించడానికి వారు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. నేను ఉన్నత స్థాయికి చేరుకుని వారికి మంచి గుర్తింపు తీసుకొస్తా. అధ్యాపకుల గైడెన్స్‌తో మంచి మార్కులు సాధించగలిగాను.

– కాళ్ల ఉమ, పాతవెంకోజీపాలెం

కంప్యూటర్ ఇంజినీరునవుతా



తాళ్లవలసలోని తిరుమల కాలేజీలో ఇంటర్ చదివిన నేను 1000 మార్కులకు గాను 982 సాధించడం ఆనందంగా ఉంది. మొదటి ఫేజ్ జేఈఈ మెయిన్స్‌లో 96.57 పర్సంటైల్ సాధించాను. సెకండ్ ఫేజ్ పరీక్షలో 98 ప్లస్ పర్సంటైల్ వస్తుందనే నమ్మకం ఉంది. మా నాన్న ఇప్పిలి లక్ష్మీ త్రినాథ్ ప్రసాద్ ఓ ప్రయివేటు కంపెనీలో చిరు ఉద్యోగి. తల్లి దీప్తి గృహిణి. ప్రతి రోజూ 18 గంటల సాధన చేశాను. అడ్వాన్స్‌డ్‌లో మంచి పర్సంటైల్ సాధించి మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేయాల్నదే నా లక్ష్యం.

–ఇప్పిలి ధృతి, పట్టాభితోట

నేడు క్రీడా దిగ్గజాల సమ్మేళనం

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా ఆదివారం అ'పూర్వ'మైన క్రీడా సంగమం జరగనుంది. 1980 నుంచి 2008 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ క్రీడా వసతి గృహాల్లో శిక్షణ పొందిన క్రీడాకారులు బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఒక్కచోట కలుసుకోనున్నారు. అప్పటి కష్టాలను, సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ.. పాత స్నేహితులతో ఆనందంగా గడపనున్నారు. నేటితరం క్రీడాకారులకు అత్యాధునిక సౌకర్యాలు, రిలయెన్స్ ఫౌండేషన్ వంటి సంస్థల ప్రోత్సాహం, ఖేలో ఇండియా వంటి ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ 80ల్లో అంతంతమాత్రంగానే ఉన్న వసతుల్లోనూ అద్భుతమైన ప్రతిభను కనబరిచారు ఈ క్రీడాకారులు. ఒలింపిక్స్‌లో హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఎడ్వర్డ్ అలాసిస్, దక్షిణ ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన విశాఖ అథ్లెట్ రామిరెడ్డి వంటి ఎందరో ఈ క్రీడా వసతి గృహాల నుంచే ఎదిగారు. కొందరు క్రీడాకారులు కోచ్‌లుగా ఎదిగి భారత జట్లకు మార్గనిర్దేశం చేశారు. మరికొందరు స్పోర్ట్స్‌లో డాక్టరేట్లు కూడా అందుకున్నారు. వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ వంటి వివిధ క్రీడాంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఈ ఆటగాళ్లంతా ఆదివారం ఒకచోట చేరి తమ జ్ఞాపకాలను పంచుకోనున్నారు. ఏపీ హాస్టలర్స్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి రామిరెడ్డి, డీఎస్పీ కోటేశ్వరరావు తదితరులు ఈ సమావేశానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళానికి చెందిన ఖాసింతో పాటు పలువురు క్రీడాకారులను సత్కరించనున్నారు.

అప్పన్న ఉంగరం చోరీ

- నేడు స్వామి ఉంగరం కోసం వెతుకులాట
- సింహగిరిపై వైభవంగా మృగయోత్సవం



విహారయాత్రకు అశ్వవాహనంపై వెళ్తున్న అప్పన్న, పల్లకీలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు



నీలుడు వేషధారణలో దారి దోపిడీకి పాల్పడుతున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సింహగిరి మాడ వీధిలో మృగయోత్సవం(దొంగలదోపు) కనులపండువగా జరిగింది. ఏడు రోజుల ఉత్సవాల్లో ఆరో రోజు రాత్రి నిర్వహించిన ఈ వేడుక వెనుక ఓ కథ ఉంది. కల్యాణం తర్వాత స్వామివారు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో కలిసి అటవీ మార్గంలో విహారానికి వెళ్తారు. భాగవతోత్తములకు నిత్యం ఆరాధన చేస్తూ.. ఆస్తినంతటినీ పోగొట్టుకున్న నీలుడు అనే పండితోత్తముడు తదియారాధన ఆగకూడదని దారి దోపిడీలకు పాల్పడుతుంటాడు. ఈ క్రమంలో స్వామి, అమ్మవార్ల ఆభరణాలు దొంగిలిస్తాడు. చివరకు అమ్మవారి కాలిమెట్టును తీయడానికి ప్రయత్నించగా.. అది ఎంతకీ రాదు. ఈ క్రమంలో తాను దొంగిలిస్తున్నది అమ్మవారి కాలిమెట్టని గ్రహించి.. మోక్షం పొందుతాడు. తన తప్పు తెలుసుకుని ఆభరణాలు తిరిగి ఇచ్చేస్తాడు. నీలుడి భక్తిని మెచ్చిన స్వామి తన సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్‌గా స్థానం కల్పిస్తాడు. విహార యాత్ర ముగించుకుని స్వామి ఆలయానికి చేరుకోగానే ఆయన ఉంగరం కనపడకపోవడంతో అమ్మవారు లోపలికి రానివ్వదు. దీంతో ఉంగరం వెతుక్కునే వేటలో స్వామి పడతాడు. చివరికి ఆయన చివరి పరదాలోనే ఉంగరం ఉంటుంది. కల్యాణోత్సవాల్లో భాగంగా దారి దోపిడీ జరిగే ఘట్టాన్ని శనివారం రాత్రి విశేషంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గోవిందరాజస్వామి అశ్వవాహనంపై, అమ్మవార్లు పల్లకీలో, తిరుమంగై ఆళ్వార్ మరొక పల్లకీలో మాడ వీధిలో ఊరేగారు. అర్చకులు నీలుడుగా, స్వామివారి దూతగా వేషధారణ చేసి దారి దోపిడీ ఘట్టాన్ని రక్తికట్టించారు. ఆదివారం ఉదయం స్వామి ఉంగరం వెతికే ఘట్టమైన వినోదోత్సవం జరగనుంది.



వైజాగ్.. వద్దే వద్దు.!

సర్వీసుల నుంచి ఒక్కొక్కటిగా తప్పుకుంటున్న ఎయిర్‌లైన్స్‌లు

- ఇటీవలే విజయవాడ సర్వీసుని రద్దు చేసిన ఇండిగో
- ఇప్పుడు రెండు ఇంటర్నేషనల్ సర్వీసులను నిలిపేస్తున్న ఎయిర్ ఏసియా
- ఇకపై వైజాగ్ నుంచి బ్యాంకాక్, మలేసియా విమానాలు ఉండవ్

సాక్షి, విశాఖపట్నం: 'దుబాయ్‌కు విమానం తీసుకొస్తాం.. వియత్నాంకు సర్వీసు తెస్తాం.. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు డొమెస్టిక్ విమాన సర్వీసులు విశాఖ నుంచి నడిచేలా చేస్తాం.' కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాహాటంగా చేసిన ప్రకటన ఇది.

కట్ చేస్తే...

'దుబాయ్ సర్వీసు విజయవాడ వెళ్లిపోయింది. వియత్నాం సర్వీసు హైదారాబాద్‌కు వెళ్లిపోయింది. కొత్త విమానాల మాట దేవుడెరుక.. ఇప్పుడు ఉన్న అంతర్జాతీయ సర్వీసులు కూడా గోవిందా.. గోవిందా.. నిత్యం రద్దీగా తిరిగే బ్యాంకాక్, కౌలాలంపూర్ సర్వీసులను వైజాగ్ నిలిపేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ ప్రకటించింది.''

- ఇదీ కూటమి సర్కారుకు విశాఖపై కురిపిస్తున్న కపట ప్రేమకు నిదర్శనం. జాతీయ, అంతర్జాతీయ సర్వీసులతో కళకళలాడుతున్న వైజాగ్ ఎయిర్‌పోర్టు.. మరికొద్ది రోజుల్లో కళావిహీనంగా మారిపోబోతోంది. కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చేతకానితనం.

సోషల్ మీడియాలోనే అభివృద్ధి!

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్‌నాయుడుని నియమించినప్పుడు వైజాగ్ ఎయిర్‌పోర్టుకు మంచి రోజులు వచ్చాయని అంతా భావించారు. ప్రస్తుతం ఉన్న రెండు మూడు విదేశీ సర్వీసులకు అదనంగా మరో 5 వరకూ సర్వీసులు రానున్నాయని అంతా ఆశించారు. ఆయన కొత్త సర్వీసులు తీసుకురాకపోగా ఉన్న సర్వీసులకు ఎసరెట్టేలో వ్యవహరిస్తున్నారన్నది జగమెరిన సత్యం. తాను అది చేస్తున్నాను.. ఇది చేస్తున్నానంటూ కేవలం సోషల్ మీడియాలోనే అభివృద్ధి చూపించేస్తున్న మంత్రి.. వైజాగ్ ఎయిర్‌పోర్టు విషయంలో మాత్రం తనకేమీ పట్టనట్లుగా ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా విశాఖ ప్రతిష్ట మసకబారుతుండటంతో.. ఇక్కడ ల్యాండ్ అవుతున్న విమానాలు.. ఇక సెలవు అంటూ బైబై చెప్పేస్తున్నాయి.

తన చేతిలోనే పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఉన్నా.. ఏనాడు విశాఖ ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ఎయిర్‌లైన్స్ సంస్థలు వైజాగ్ వద్దే వద్దంటూ మూటాముల్లె సర్దుకొని వెళ్లిపోతున్నాయి.

బ్యాంకాక్, మలేషియాకు రాం రాం.!

కరోనా తర్వాత అంతర్జాతీయ సర్వీసులు వైజాగ్ నుంచి అవసరమంటూ పట్టుబట్టి మరీ.. సింగపూర్ సర్వీసుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టింది. 2023 ఏప్రిల్ 9న బ్యాంకాక్‌కు, 2024 ఫిబ్రవరిలో ప్రకటించిన తర్వాత అదే ఏడాది ఏప్రిల్ 26న కౌలాలంపూర్‌కు ఎయిర్ ఏసియా సంస్థ అంతర్జాతీయ సర్వీసులను విశాఖ నుంచి ప్రారంభించింది. మొన్నటి వరకూ దాదాపు ఫుల్ ప్యాక్‌తో సర్వీసులు నడిచాయి. బ్యాంకాక్ సర్వీసులో ప్రతిరోజూ దాదాపు 200 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. కౌలాలంపూర్ సర్వీసు ప్రతి రోజూ 150 నుంచి 200 మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేరవేస్తోంది. అయినప్పటికీ ఈ సర్వీసుల్ని మే ఒకటి నుంచి నిలిపేస్తున్నట్లు ఎయిర్‌ఏసియా సంస్థ ప్రకటించింది. ఇకపై వైజాగ్ నుంచి ఒకే ఒక్క సింగపూర్ సర్వీస్ నడవనుంది. పది సర్వీసులు తీసుకొస్తానన్న కేంద్ర మంత్రి చివరికి ఒకే ఒక్క సర్వీసుకి పడిపోయేలా చేశారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. పోనీ కొత్త సర్వీసుల విషయంలోనైనా జాగ్రత్తగా ఉన్నారా అంటే అదీ లేదు. ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థ ఎమిరేట్స్ ఏపీ నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసు నిర్వహించేందుకు సిద్ధమైన తరుణంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడంతో విజయవాడ నుంచి ప్రారంభించేసింది. ఇక వైజాగ్ నుంచి నుంచి వియత్నాంలోని ప్రధాన నగరం హోచిమిన్ సిటీకి ఈ ఏడాది సర్వీసు ప్రారంభిస్తామని వియట్‌జెట్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. కానీ ప్రభుత్వం స్పందించకపోవడంతో హైదరాబాద్ నుంచి సర్వీసులు ప్రారంభించేసింది. ఇలా ఉన్నవీ పోయి.. కొత్తవీ తీసుకురాకపోవడం సిగ్గు చేటు అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



విశాఖకు బైబై.. విజయవాడకు రయ్ రయ్

డొమెస్టిక్ సర్వీసులూ విశాఖ నుంచి ఒక్కొక్కటిగా దూరమవ్వడం మొదలైంది. విశాఖ నుంచి విజయవాడకు ఉదయం సమయంలో ఉన్న సర్వీసుల్ని రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రకటించింది. ఈ విమానాన్ని రాయ్‌పూర్ నుంచి రాజ్‌కోట్‌కు నడుపుతున్నట్లు స్పష్టం చేసింది. ఉన్న సర్వీసులు పోతున్న నేపథ్యంలో ప్రముఖ ఎయిర్ లైన్స్ ఆకాశా సంస్థ వైజాగ్ నుంచి హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ నగరాలకు సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ విషయంపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో పాటు.. వైజాగ్ ఎయిర్‌పోర్టు అధికారులకు రెండు నెలల క్రితమే సమాచారం పంపించినా.. కేంద్ర మంత్రి నుంచి స్పందన లేకపోవడంతో ఆకాశా ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము కోరుండి సర్వీసులు నడుపుతామన్నా పట్టించుకోనప్పుడు.. వైజాగ్‌లో నడిపేందుకు ఎందుకు ఆసక్తి చూపించాలని ప్రశ్నిస్తున్నారు.

కేంద్ర మంత్రికి విన్నవించుకున్నాం..



విశాఖ నుంచి విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. టైర్–2 నగరాల నుంచి కూడా విదేశీయానానికి అవకాశాలు పుష్కలమవ్వడంతో అవుట్ బౌండ్ టూరిజం గణనీయంగా వృద్ధి చెందుతోంది. దీనికి తోడు వీసా లేకుండా రావొచ్చంటూ వివిధ దేశాలు ప్రకటించడంతో కొత్త సర్వీసుల కోసం ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సమయంలో ఉన్న సర్వీసులు కూడా నిలిచిపోవడం బాధాకరం. ఈ తరహా సర్వీసుల రద్దు భవిష్యత్తులో విశాఖ ఎయిర్‌పోర్టుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ విషయంలో చొరవ చూపించాలని కేంద్ర మంత్రికి అసోసియేషన్ల తరఫున లేఖలు రాశాం.

–విజయ్‌మోహన్, ఏపీ ట్రావెల్ అండ్ టూర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

జై శ్రీరామ్



ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

ఏయూక్యాంపస్: రామనామ స్మరణతో సాగరతీరం ప్రతిధ్వనించింది. జై శ్రీరామ్ నినాదాలతో హనుమంతుని భక్తుల హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. వేలాది మంది నగరవాసులు సంప్రదాయ దుస్తులు, తలపాగాలతో, చేతుల్లో హనుమంతుని జెండాలతో శోభాయాత్రలో నృత్యాలు చేస్తూ.. తీరం వెంబడి ర్యాలీగా ముందుకు సాగారు. శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తుండగా, వెనుక వేలాది మంది భక్తులు కాషాయ జెండాలు పట్టుకుని రామనామం జపిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్రకు ముందు బైక్ ర్యాలీ జరిగింది. ఈ రెండు కార్యక్రమాలు నగరానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి. శనివారం సాయంత్రం పార్క్ హోటల్ కూడలి వద్ద ప్రారంభమైన శోభాయాత్ర ఆర్.కె. బీచ్ వరకు కొనసాగింది. ఈ ఊరేగింపులో శ్రీ సీతారాములు, హనుమ, వివేకానందుడు, ఛత్రపతి శివాజీ, రుషుల వేషధారణలో కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హనుమంతుని వేషధారణలో ఉన్న వ్యక్తితో నగరవాసులు ఆసక్తిగా ఫొటోలు దిగారు. భారీ హనుమ విగ్రహాన్ని ఊరేగిస్తూ వేలాది మంది భక్తులు దాని వెంట నడిచారు. అంతకు ముందు పెందుర్తి, గాజువాక, ఆనందపురం, పోస్టాఫీస్, ఎన్ఏడీ కూడలి ప్రాంతాల నుంచి నగరవాసులు బైక్ ర్యాలీగా పార్క్ హోటల్‌కు చేరుకున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ వేడుకలో భాగస్వాములయ్యారు. అనకాపల్లి ఎంపీ సి.ఎం రమేష్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, బీజేపీ నగర అధ్యక్షుడు పరసురామ రాజు తదితరులు పాల్గొన్నారు.

'భెల్' వ్యవహారంపై సమగ్ర విచారణ

- పరీక్ష పత్రం లీకేజీపై భెల్, జియోన్‌లకు నోటీసులు

పెందుర్తి: చినముషిడివాడలోని జియోన్ టెక్నాలజీస్‌లో 'భెల్' ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బాధిత అభ్యర్థుల ఫిర్యాదు మేరకు కేసును అన్ని కోణాల్లోనూ సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్)లో సూపర్‌వైజర్ ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగాలకు శుక్రవారం చినముషిడివాడలోని జియోన్ టెక్నాలజీస్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించగా ఆ పరీక్షకు సంబంధించిన జవాబు పత్రం లీకైన సంగతి తెలిసిందే. దీనిపై బాధిత అభ్యర్థులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం వేకువజాము వరకు కేంద్రంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి తగిన ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం భెల్ కంపెనీతో పాటు జియోన్ టెక్నాలజీ సంస్థకు కూడా ఈ ఘటనపై తగిన వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. వారి నుంచి సమగ్ర నివేదిక వచ్చిన తరువాత కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు పరీక్ష జవాబు పత్రం లీకేజీ వ్యవహారంలో తమ బాధ్యత లేదని జియోన్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి కిశోర్ తెలిపారు. ఓ ఇన్విజిలేటర్, అభ్యర్థి చేసిన తప్పిదం కారణంగా సంస్థ బాధ్యత వహించాల్సి వచ్చిందన్నారు. పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు.

నేత్రపర్వం.. వసంతోత్సవం

- రంగులమయమైన సింహగిరి
- పరవశించిన భక్తజనం



కొట్నాలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గంగధార వద్ద చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా జరిగాయి. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, చక్రపెరుమాళ్లు, ఆళ్వారులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. పసుపు కొమ్ములను దంచి కొట్నాలు సేవ చేశారు. వసంతాలను ఉత్సవమూర్తుల వద్ద ఉంచి పూజలు జరిపారు. ఆ వసంతాలతో అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఆలయ బేడా ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలోని స్వామివారి మూల విరాట్‌కు, ఆలయంలో కొలువుదీరిన దేవతా మూర్తులకు వసంతాలు సమర్పించారు. అక్కడి నుంచి వసంతాలను మళ్లీ కల్యాణ మండపానికి ప్రదక్షిణగా తీసుకొచ్చి ఉత్సవ మూర్తులకు సమర్పించారు. అనంతరం ఆ వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. తదుపరి అర్చకులు, సిబ్బంది, భక్తులు వసంతాలను ఒకరిపై ఒకరు జల్లుకుని సందడి చేశారు. తర్వాత ఉత్సవ మూర్తులను ఒక పల్లకీలో, చక్రపెరుమాళ్లు, ఆళ్వారులను మరొక పల్లకీలో గంగధార వద్దకు తిరువీధిగా తీసుకెళ్లారు. అక్కడ గంగధార, పంచామృతాలతో పంచ కలశ స్నపనాన్ని విశేషంగా జరిపారు. చక్రస్నాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చక్రపెరుమాళ్లను గంగధార నీటి ప్రవాహం వద్ద ఉంచి ఆ నీటిని భక్తులపై పడేలా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్నానమాచరించారు. తదుపరి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి ఆలయంలోకి తిరువీధిగా తీసుకెళ్లారు. అంతకుముందు ఆలయ యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు సతీసమేతంగా ఉత్సవంలో పాల్గొన్నారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

3 ఆయిల్ ట్యాంకర్లు సీజ్

- 7,300 లీటర్ల డీజిల్ స్వాధీనం

మధురవాడ: ఐటీ సెజ్ పక్కన నిర్మాణంలో ఉన్న వెంచర్‌లో 2 భారీ ఆయిల్ ట్యాంకర్లతో పాటు మరో చిన్న ట్యాంకర్‌ను శనివారం అధికారులు సీజ్ చేశారు. సరైన బిల్లులు లేకుండా ట్యాంకర్ ఇక్కడికి వచ్చినట్టు పక్కా ఫిర్యాదు అందడంతో సివిల్ సప్లై డీఎస్‌వో సీఆర్ కల్యాణి, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పి.రేవతి, విజిలెన్స్ సీఐ ఎ.సంతోష్, కమర్షియల్ ట్యాక్స్ అధికారి శైలజ తదితరులు సంఘటనా స్థలికి చేరుకుని అనుమానిత వాహనాలు పరిశీలించి, సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ నిబంధనలతో పాటు అత్యవసర సరకుల చట్టం కూడా ఉల్లంఘించినందున వీటిని సీజ్ చేసినట్టు చెప్పారు. ట్యాంకర్లతో పాటు 7,300 లీటర్ల డీజిల్‌ను కూడా సీజ్ చేసినట్టు వివరించారు. ఆయిల్ ట్యాంక్ నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేసి జేసీ కోర్టులో ప్రవేశపెడుతున్నామని, శాంపిల్స్ సేకరించి విచారణ చేస్తున్నట్టు తెలిపారు. ఆయిల్ ట్యాంకర్లలో ఉన్నది ఇండస్ట్రియల్ ఆయిలా లేక సాధారణ ఆయిలా? గాజువాకలో ఆగాల్సిన వాహనం ఇక్కడికి ఎందుకు వచ్చింది? నిబంధనలకు లోబడే ట్యాంకర్‌లో ఉన్న ఆయిల్ అన్‌లోడ్ అయ్యిందా అన్న విషయాలపై ఆరా తీశారు. ఆయిల్ ట్యాంకర్ తిరిగిన ప్రదేశాలను జీపీఎస్ ద్వారా ట్రాకింగ్ చేస్తున్నారు. ఆయిల్ ట్యాంక్ నిర్వాహకులు మాత్రం నిబంధనలకు లోబడే ఆయిల్ అన్‌లోడ్ చేశామని, ఖాళీ ట్యాంకర్ మాత్రమే ఇక్కడికి వచ్చినట్టు చెబుతున్నారు. అయితే విచారణ తర్వాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ట్రేడింగ్ కంపెనీల వల్ల తమ ఆదాయానికి గండి పడుతుందని పెట్రోల్ బంక్‌ల అసోసియేషన్ ఇచ్చిన పక్కా సమాచారంతోనే ఇక్కడ దాడి చేసి ట్యాంకర్లను సీజ్ చేసినట్టు తెలుస్తోంది. ఈ దాడుల్లో విశాఖ రూరల్ మండలం సివిల్ సప్లై ఆర్ఐ రామకృష్ణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బండరాయితో ఒకరిపై దాడి

- పరిస్థితి ఆందోళనకరం.. కేజీహెచ్‌లో చికిత్స



చికిత్స పొందుతున్న నరసింహారావు

సీతమ్మధార: అబిద్‌నగర్ పార్కులో ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలివి..అక్కయ్యపాలెం అబిద్‌నగర్ ప్రాంతంలో ఆవాల నరసింహారావు, లక్ష్మి నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. నరసింహారావుకు మద్యం అలవాటు ఉంది. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగి.. భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా.. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత తర్వాత నరసింహారావు అబిద్‌నగర్ పార్కులో మద్యం సేవించి.. పక్కనే ఉన్న పార్కులో నిద్రపోయాడు. ఆ తర్వాత గుర్తు తెలియని వ్యక్తితో అతనికి గొడవ జరిగింది. దీంతో ఆయన బండరాయితో తలపై గట్టిగా దాడి చేశారు. దీంతో నరసింహారావు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఉదయం స్థానికులు ప్రాణాపాయస్థితిలో ఉన్న నరసింహారావును గుర్తించి..112కు సమాచారం అందించారు. సీఐ ఎ.సత్యనారాయణ, ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నరసింహారావును కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు సీసీ ఫుటేజ్, ఇతర ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలిస్తున్నారు. కాగా.. ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ వెంకట్రావ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

సాక్షి విలేకరి వెంకటరమణకు ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు



అవార్డును అందుకుంటున్న సాక్షి విలేకరి చిటికిరెడ్డి వెంకటరమణ

విశాఖ సిటీ: విశాఖ సాక్షి విలేకరి చిటికిరెడ్డి వెంకటరమణకు ఉత్తమ జర్నలిస్టు అవార్డు లభించింది. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ చేతుల మీదుగా మానవీయ కోణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్టుల విభాగంలో సాక్షి విలేకరి సిహెచ్.వెంకటరమణ అవార్డు అందుకున్నారు. అలాగే విశాఖలో పలువురు జర్నలిస్టులకు ఈ పలు విభాగాల్లో అవార్డులు వరించాయి. ఇందులో సామాజిక బాధ్యత భద్రతా విభాగంలో గంట్ల శ్రీనుబాబు, పి.బాలభాను, క్రైం జర్నలిజం విభాగంలో నందకుమార్, కిరణ్, బంగారు అశోక్‌కుమార్, ఫొటో, వీడియో విభాగంలో నీలాపు అశోక్, చిన్న పత్రిక, మీడియా ప్రోత్సాహం విభాగంలో పోలాకి రవికుమార్ అవార్డులు పొందారు. అలాగే సామాజిక స్పృహ, చైతన్యం విభాగంలో ఎం.ఎస్.ఆర్.ప్రసాద్, కృష్ణపాత్రో, కేబుల్ టీవీ న్యూస్ రీడర్ విభాగంలో కొణతాల మీన, తరుణ్‌జ్యోతి, సీనియర్ జర్నలిస్టుల విభాగంలో ఎండీ అబ్దుల్లా, మహిళా జర్నలిస్టుల విభాగంలో పి.వీర లత, ఎం.లత అవార్డులు స్వీకరించారు.

పింక్ మూన్



ఆకాశంలో మరో అద్భుత దృశ్యం ఆవిష్కృతం అయింది. ఎప్పుడూ ధగ ధగ మెరుస్తూ తెల్లగా కనిపించే చంద్రుడు.. శనివారం రాత్రి పింక్ కలర్‌లో దర్శనమిచ్చాడు.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న శశి విద్యాసంస్థల ప్రతినిధులు

తగరపువలస: ఇంటర్ ఫలితాల్లో సంగివలస బ్రాంచ్‌కు చెందిన తమ విద్యార్థులు విశేష ప్రతిభ చూపారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎంపీసీ సెకండియర్ లో 699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 697 మంది పాసై 99.7 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో బోని పూజిత అత్యధికంగా 991 మార్కులు సాధించింది. బైపీసీలో 122 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా శత శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెంటు యామిని 988 మార్కులు సాధించింది. ఎంపీసీ ఫస్టియర్‌లో 535 మంది పరీక్షలకు హాజరుకాగా 525 మంది పాసై 98.1 శాతం ఉత్తీర్ణత నమోదైంది. హెచ్.తేజస్విని, కె.నిరీక్షణ్, లంకా గౌతమ్, ఎం.లాస్య, చింతల కస్యప్, సలాది మోనిష 466 మార్కులు పొందారు. బైపీసీలో 137 మంది విద్యార్థులకు గాను శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. కె.ప్రణయ్ 436 మార్కులు పొందాడు. వీరిని వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, కరస్పాండెంట్ మేకా క్రాంతిసుధ తదితరులు అభినందించారు.

తిరుమల విద్యార్థుల హవా



ఉత్తమ ఫలితాలు సాధించిన తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు

తగరపువలస: ఇంటర్ ఫలితాల్లో తాళ్లవలస తిరుమల విద్యార్థులు సత్తా చాటినట్లు సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీ నుంచి ఎం.విద్యాచరణ్, ఆర్.హేమచరణ్, ఎ.ఆర్.ప్రజ్వలిత, కె.లలిత్ ఆదిత్య, బి.సిద్దార్థ్, ఎం.భగవతి, జె.శ్రీలక్ష్మి, వై.తనుశ్రీ, కె.దీపిక, కె.స్పందన 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు గాను సీహెచ్ మేఘన 436 మార్కులు సాధించింది. ఫైనల్ ఇయర్ ఎంపీసీలో వై.స్నేహిత, కె.శృతిలయ, కె.తులసి 990 మార్కులు సాధించారు. బైపీసీలో వై.అశ్వినిశ్రీ 989 అత్యధిక మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను రెసిడెంట్ డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబు అభినందించారు.

ఎసెంట్ విద్యార్థుల ప్రభంజనం



కె.నైనిషా, (466/470)



కె.వాసవి ప్రియ, (988/1000)

మద్దిలపాలెం: ఇంటర్ ఫలితాల్లో ఎసెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూప్‌లో 95.8 ఉత్తీర్ణత శాతం, సెకండియర్ ఎంపీసీ గ్రూప్‌లో 98.2 ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థి కె.నైనిషా 466, సెకండియర్ ఎంపీసీ విద్యార్థి కె.వాసవి 988 మార్కులు సాధించారు. 811 మంది ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థుల్లో 655 మంది విద్యార్థులు 'ఎ'గ్రేడ్ మార్కులను సాధించారు. 816 మంది సెకండియర్ ఎంపీసీ విద్యార్థుల్లో 661 మంది విద్యార్థులు 'ఎ'గ్రేడ్ మార్కులను సాధించారు. విద్యార్థులు, అధ్యాపకులను ప్రిన్సిపాళ్లు బి.శ్రీనివాస్ రావు, ఎం.గౌరినాయుడు అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం



శ్రీవిశ్వ కళాశాల టాపర్స్

సీతంపేట: ఇంటర్ ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఫస్టియర్ ఎంపీసీలో లోపింటి తనుష్క, ఉమ్మెత్తల శ్రీలయ, చందక శరత్‌కుమార్, బందారు జాహ్నవి, గంటేడ కౌశిక్, సిహెచ్.ఎస్.సంయుక్త, జి.మీనాక్షి ఎ.భవ్యశ్రీ 465 మార్కులు సాధించారు. బైపీసీలో మేకా లక్ష్మీ ప్రసన్న 440 కి 435 మార్కులు, పి.డి.జ్యోతి మాన్విత, ఎస్.పూజా కృష్ణవేణి 434 మార్కులు, గొండు భార్గవి 433 మార్కులు పొందారు. సెకండియర్ ఎంపీసీ బొల్లా రోహిత్, కన్నం నవ్యశ్రీ, పాలవలస మేఘన వెయ్యికి 989 మార్కులు, మడసు హాసిని, మంగ భాను తేజ, దంగేటి పల్లవి 988, బైపీసీలో రెడ్డి రేష్మ 984 మార్కులు సాధించారు. వీరిని శ్రీవిశ్వ విద్యా సంస్థల చైర్మన్ కె.ఎస్.హెచ్.ఆర్.కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

నారాయణ విద్యార్థుల విజయదుందుభి



ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన నారాయణ విద్యార్థులు

సీతమ్మధార: ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు మరోసారి విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 465 పైన ఇద్దరు, 464 పైన ఆరుగురు, 460 పైన 24 మంది సాధించారు. ఇందులో ఈ. శ్రావణి 465, బి.జస్మిని 465, పి.విహాస్ 464 మార్కులు పొందారు. ఫస్టియర్ బైపీసీలో 440 మార్కులకు గాను 430 పైన నలుగురు, 420 పైన 14 మంది మార్కులు సాధించారు. ముక్క మైత్రి 433, పి.శశికళ 431 మార్కులు పొందారు. విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా బోధిస్తూ.. విజయాలు సాధిస్తున్నట్లు డీజీఎం తెలిపారు. డీజీఎంతోపాటు కోర్ డీన్ పి.వరప్రసాద్, ఎం.జగదీష్‌రెడ్డి విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో శ్రీ చైతన్య ప్రతినిధులు

విశాఖ విద్య: ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు సతా చాటారు. సెకండియర్ ఎంపీసీలో కురమదాసుపు శ్రీజ 992 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం దక్కించుకున్నట్లు విద్యా సంస్థల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. ఎంపీసీలో ఆకెళ్ల మేఘన శర్మ 991, సంబంగి మనస్విని 991, పి.మహేంద్ర 990, బైపీసీలో కాండ్రేగుల జ్వలిత 990 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం నగరంలోని ప్రధాన కార్యాలయంలో ఏజీఎం ప్రత్యేకంగా అభినందించారు. డీన్లు కె.బంగారుబాబు, ఎస్.రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో ఈనెల 16 నుంచి జూన్ 16 వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల గృహిణులు ఇనిస్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999 ఫోన్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

నకిలీ ఐటీ అధికారిణి అరెస్ట్

ఎంవీపీకాలనీ: ఇన్‌కం ట్యాక్స్ అధికారిగా చెప్పుకుంటూ నగరంలో పలు ఆర్థిక మోసాలకు పాల్పడిన ఈత దేవిరావు అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఆమెను పట్టుకున్నాయి. అత్తిలి తరుణ్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఇప్పటికే ఆమె అనేక ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. స్థలాల విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, చెక్ బౌన్స్ వంటి పలు కేసుల్లో ఆమె నిందితురాలుగా ఉన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో ఆమెపై కేసులు నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈత దేవిరావు చేతిలో మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే.. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, ఆమెపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.